క్లుప్తంగా

కండలేరులో 12.427 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 12.427 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి

గూడూరు రూరల్ : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గూడూరు అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి పి.లోకనాథం తెలిపారు. చెన్నేరు ఎస్టీ కాలనీలో శనివారం సాయంత్రం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులకు నిర్బంధ విద్యను అమలు చేసేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కోటేశ్వరరావు, అరవ పార్వతయ్య, మహబూబ్‌బాషా, పీఎల్‌వీ రామసుబ్బయ్య, ఏఎస్‌ఐ శ్రీవాసు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1.5 లక్షల విరాళం



ఈవోకు నగదు అందజేస్తున్న హరిప్రసాద్, సింధు

రాపూరు : మండలంలోని పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం బెంగళూరుకు చెందిన నరసాపురం తిరుపాలయ్య, చెంగమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు హరిప్రసాద్, సింధు రూ.1,50,111 విరాళం ఇచ్చినట్టు ఈవో జనార్ధన్‌రెడ్డి తెలిపారు. వారికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు శశిస్వామి పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

చిల్లకూరు : మండలంలోని కలవకొండ సీమపంలో శనివారం రాత్రి టిప్పర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని చింతవరానికి చెందిన జోగి శ్రీనివాసులు గూడూరు నుంచి బైక్‌లో ఇంటికి బయలుదేరాడు. కలవకొండ సమీపంలో చింతవరం వైపు వెళుతున్న టిప్పర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108 ద్వారా గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు తీసుకెళ్లారు. దీనిపై తమకు సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

వలంటీర్ల నియామకం



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు : మండలంలోని పెళ్లకూరు, పాలచ్చూరు, తాళ్వాయిపాడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులను భర్తీ చేసినట్టు ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికై న వారికి నియామక పత్రాలు అందజేశామన్నారు. తాళ్వాయిపాడుకు మనుబోలు శివాజీ, కన్నడ పుష్పకుమార్, పాలచ్చూరుకు ఓరేపల్లి నాగరత్నమ్మ, పెళ్లకూరుకు కళత్తూరు లీలావతి ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఎంపీడీవో సురేష్‌బాబు, నాయకులు రమణారెడ్డి, కృష్ణయ్య, కుమారస్వామి, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వర స్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ట చేసి మొదట గణపతి పూజ, కలశ పూజ చేశారు. అనంతరం నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, పవిత్ర కలశ జలాలతో అభిషేకం చేశారు. తదుపరి విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

కార్మిక చట్టాల అమలు బాధ్యత యాజమాన్యాలదే

శ్రీకాళహస్తి : కర్మాగారాల్లో కార్మిక చట్టాలను అమలు బాధ్యత యాజమాన్యాలదేనని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబిరాణి అన్నారు. మండలంలోని కాపుగున్నేరి పంచాయతీ ఇసుకగుంట సమీపంలోని కోకాకోలా బేవరేజస్ లిమిటెడ్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించేలా యాజమాన్యాలు వ్యవహరిస్తే తగిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, శ్రీరామ్, సుబాని పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



దక్కిలి: కబడ్డీ విజేత జట్టును అభినందిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో



రాపూరు : విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయిన బంగారుపేట క్రికెట్ జట్టు

దక్కిలి : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. స్థానిక ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా శనివారం ఫైనల్స్ చేపట్టినట్టు తెలిపారు. కబడ్డీలో వెంబులూరు–మాధవయ్యపాళెం జట్లు తలపడ్డాయని, మాధవయ్యపాళెం జట్టు విజేతగా నిలిచిందన్నారు. ఖోఖోలో వెంబులూరు–డీ వడ్డిపల్లి జట్లు తలపడగా డీ వడ్డిపల్లి జట్టు విజేతగా, క్రికెట్‌లో డీ వడ్డిపల్లి– నాగవోలు జట్ల మధ్య జరిగిన పోటీలో నాగవోలు జట్టు విజేతగా నిలిచిందని వివరించారు. వారిని అధికారులు, నాయకులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 జగదీష్, సూపరింటెండెంట్ అనూరాధ, పీడీలు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

రాపూరు: క్రీడలతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని ఎంపీడీవో అప్పాజీ, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సిద్ధవరం గ్రామంలో శనివారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు బాలుర విభాగంలో క్రికెట్‌లో పంగిలి, బాడ్మింటన్‌లో రాపూరు1, కబడ్డీలో రాపూరు 1, వాలీబాల్‌లో రాపూరు1, బాలికల విభాగంలో కబడ్డీలో కంబాలపల్లి, ఖోఖోలో కంబాలపల్లి టీమ్‌లు ఎంపికైనట్టు తెలిపారు.

నియోజకవర్గస్థాయి పోటీలకు 10 టీమ్‌లు ఎంపిక

వెంకటగిరి రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి ప్రోత్సహించడానికే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎంపీడీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. డిసెంబర్ 10 నుంచి ప్రారంభమైన మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. పట్టణంలోని విశ్వోదయ కళాశాల ప్రాంగణంలో శనివారం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించగా 260 జట్లు తలపడగా నియోజకవర్గ స్థాయి పోటీలకు పది జట్లు ఎంపికయ్యాయి. క్రికెట్ విభాగం పురుషుల మున్సిపాలిటీలోని బంగారుపేట–1, మహిళల విభాగంలో వెం



బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు

కటగిరి రూరల్ మండలం పెట్లూరు, వాలీబాల్ పోటీల్లో పురుష విభాగంలో ఎన్టీఆర్ కాలనీ, మహిళ విభాగం పెట్లూరు, కబడ్డీ పోటీల్లో పురుష విభాగంలో ఎన్టీఆర్‌కాలనీ, మహిళ విభాగంలో సాలికాలనీ, ఖోఖో మహిళల విభాగంలో జంగాలపల్లి, పురుషుల విభాగంలో అమ్మవారిపేట, బ్యాడ్మింటన్‌లో పురుషుల విభాగంలో రాణీపేట, మహిళల విభాగంలో పాళెంకోట సచివాలయాల జట్లు ఎంపికైనట్టు తెలిపారు.

బహుమతి ప్రదానం

సైదాపురం: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా శనివారం నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ శశి ఇంద్రాణి పాల్గొన్నారు.

పార్టీ గెలుపుకోసం సైనికుడిలా పనిచేయాలి

- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- కార్యకర్తలు, నేతలతో సమావేశం



నేదురుమల్లిని సత్కరిస్తున్న మేరిగ మురళీధర్

గూడూరు రూరల్ : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శనివారం గూడూరు సనత్ నగర్‌లోని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ నివాసం వద్ద పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా అమలుచేస్తున్న పథకాల గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. చేసిన మేలును గుర్తించి వైఎస్సార్ సీపీకి ఓటు వేసేలా కృషి చేయాలని సూచించారు. గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో మేరిగ మురళీధర్, కిలివేటి సంజీవయ్య, వెంకటగిరి నుంచి తాను పోటీ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేయాలని కోరారు. నాయుడుపేటలో ఆదివారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఐదు జిల్లాల్లో ఒక సభను ఏర్పాటు చేసి కార్యకర్తలకు భరోసా ఇవ్వనున్నారని, ఇందులో భాగంగా ఈ నెలాఖరులో తిరుపతిలో సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత స్థానం కల్పిస్తూ ఉన్నత పదవులు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తనకు గూడూరు నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారని తెలిపారు. తనను ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ, సీఈసీ సభ్యుడు ధనుంజయరెడ్డి, అన్ని మండలాల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ బూదరు గురువయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, నాయకులు కోడూరు మీరారెడ్డి, బత్తిన విజయకుమార్, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, కొడవలూరు భక్త వత్సలరెడ్డి, కస్తూర్‌రెడ్డి, బాలక్రిష్టారెడ్డి, క్రిష్ణయ్య, నరసయ్య, మొబీన్‌బాషా, జిల్లా మహిళా అధ్యరాలు మాధవి, నాగిశెట్టి శారదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వికసిత్ భారత్ గ్రామసభలు



కొత్తచెరువులో హెల్త్ కార్డులు అందజేస్తున్న సర్పంచ్ మహేందర్‌రెడ్డి



డ్రోన్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓజిలి: మండలంలోని గుర్రంకొండ, కుందాం, కొత్తచెరువు గ్రామాల్లో చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభలు ఆదివారం ముగిశాయి. ఈవోపీఆర్డీ మోహన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు గ్రామసభలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. డ్రోన్ ద్వారా పంటలపై మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుందాం పీఏసీఎస్ అధ్యక్షుడు రాజారామిరెడ్డి, సర్పంచులు మహేందర్‌రెడ్డి, ఎద్దల కనకదుర్గారమణి, ముప్పాళ్ల మాధవీలత, నాయకుడు మోహన్‌రాజు, కార్యదర్శులు సిరాజ్, మస్తానయ్య, భూదేవి, ఏఎన్ఎం కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని దామరాయి, కొరిడి పంచాయతీల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేసీఎన్ గుంట సచివాలయాల కార్యదర్శి సుదీర్ కేంద్ర ప్రభుత్వ పథకాలపై విడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా మందుల పిచికారీని ప్రదర్శించి చూపించారు. పొదుపు సభ్యులు డ్రోన్ కొనుగోలు చేసుకుంటే కేంద్ర ప్రభుత్వం 80 శాతం రాయితీ ఇస్తోందని వివరించారు. ఉపాధి ఏపీవో నాగరాజు, సర్పంచులు రమణయ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అక్షింతల పంపిణీ



సిద్ధవరంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

రాపూరు : మండలంలోని సిద్ధవరం గ్రామంలో శనివారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను సమరత సేవా ఫౌండేషన్, ఆర్ఎస్ఎస్, ఇస్కాన్ ఆధ్వర్యంలో గడప గడపకూ పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ అయోధ్యలో సోమవారం రాముడి విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. ఆ రోజు విగ్రహ ప్రతిష్ట అనంతరం అక్షింతలను కుటుంబ సభ్యుల తలపై చల్లుకోవాలని సూచించారు. సాయంత్రం ఇళ్లలోని తులసి చెట్టు, గడప వద్ద రెండు దీపాలు వెలిగించాలని కోరారు. అనంతరం గ్రామస్తులు భజనలు చేయాలన్నారు.

కోట మండలంలో..



అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామపెద్దలు

కోట : మండలంలోని సిద్ధవరం గ్రామంలో శనివారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామపెద్దల చేతుల మీదుగా అక్షింతలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ధ్రువకుమార్ రెడ్డి, బీజేపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, పనబాక కోటేశ్వరరావు, కోటారెడ్డి పాల్గొన్నారు.

సామాజిక సాధికార సభకు తరలిరావాలి

ఓజిలి: నాయుడుపేట పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'మిచాంగ్ తుపాను' సేవకులకు అవార్డులు



అవార్డులు అందుకున్న సేవకులు

వాకాడు : ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపాను సమయంలో మండల ప్రజలకు విశేష సేవలందించిన ముగ్గురు సేవకులకు శనివారం జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో మండలంలోని బాలిరెడ్డిపాళెంలో అవార్డులు అందజేశారు. అందులో వాకాడు గ్రామ ఉపసర్పంచి పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డికి రాజస్థాన్‌కు చెందిన జ్ఞానోదయ ఫౌండేషన్ సంస్థ ఇంటర్నేషనల్ అచీవర్స్ అవార్డును అందజేసింది. అలాగే బాలిరెడ్డిపాళెం పట్టాభిరామాలయం ప్రధాన అర్చకుడు దీవి అనంతాచార్యులుకు వరల్డ్ బుక్ ఆఫ్ సంస్థ వారు మహాత్మాగాంధీ మెమోరియల్ అవార్డు, జెమిన్ కొత్తపాళెం గ్రామ ఉపసర్పంచ్ మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డికి సహారా చారిటబుల్ ట్రస్టు వారు రియల్ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె భరత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.విజయ్‌కుమార్, పరిశీలకుడు టి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

28న బలిజల ఆత్మీయ సమావేశం

గూడూరు రూరల్ : గూడూరు రెండో పట్టణంలో నికాస్మోలిటన్ క్లబ్‌లో 28న డివిజన్‌లోని బలిజ లు, బలిజ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, విశ్రాంత డీఈ అనీల్‌కుమార్ తెలిపారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో బలిజల సమస్యలపై చర్చించడంతో పాటు వారి అభ్యున్నతికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నదానం





భక్తులకు అన్నదానం, స్వామి వారికి నిర్వహిస్తున్న పల్లకి సేవ

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లకి సేవ చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. స్వామి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిపై ఉంచి ఊరేగించారు. ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాపూరు : మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగి సేవ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేశారు.

కింగ్స్ క్రికెట్ టోర్నమెంట్ విజేత వెడిచెర్ల జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సురేష్‌బాబు

గూడూరు రూరల్ : మండలంలోని మేకనూరులో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కింగ్స్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా వెడిచెర్ల జట్టు నిలిచింది. ఐదు రోజులుగా 8 జట్లు హోరాహోరీగా తలపడి క్రికెట్ పోటీలు సాగాయి. శనివారం ఫైనల్స్‌లో వెడిచెర్ల, మేకనూరు జట్టు తలపడగా వెడిచెర్ల విజేతగా నిలిచింది. వారికి వైఎస్సార్ సీపీ నాయకుడు, చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్ బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొర్ల విజయ, వైస్ సర్పంచ్ ముమ్మడి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు గొర్ల రమేష్‌యాదవ్, అమరేంద్ర, కిరణ్, ఆర్గనైజర్లు మద్దాలి చిరంజీవి, వెంకటేశ్వర్లు, పెంచల్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుర ఉత్సవం



స్వామి, అమ్మవార్ల ఊరేగింపులో పాల్గొన్న అధికారులు, భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పద్మశాలిపేటలో శనివారం శ్రీభద్రావతి సమేత భావనారుషి పుర ఉత్సవం వైభవంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనతరం పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయంలో ఈనెల 17వ తేదీ నుంచి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం నాటితో ముగియనున్నాయి.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి



నాయకులతో డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు : వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండో సారి బాధ్యతలు చేపడతారని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆయన శనివారం చిల్లకూరులోని తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. జననేత జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు కలిగిందన్నారు. నాయుడుపేటలో ఆదివారం చేపడుతున్న సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. మండలం నుంచి పెద్ద సంఖ్యలో సాధికార యాత్రకు వెళ్లేలా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేశామన్నారు. ఎన్నికలకు 75 రోజులు మాత్రమే గడువు ఉండడంతో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, నాయకులు రఘునాయుడు, సురేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాతయ్య, చంద్రయ్యనాయుడు, బాలసుబ్రమణ్యం, వినోద్‌రెడ్డి, జితేంద్ర, కుమారస్వామి, కృష్ణయ్య, లింగమనాయుడు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేవీకేను సందర్శించిన విద్యార్థులు



కేవీకేలో షేర్‌నెట్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని పెరియవరం సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాన్ని శనివారం స్థానిక కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సందర్శించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.గోవిందరాజులు కేవీకే ద్వారా చేపడుతున్న పశుపోషణ, గృహ విజ్ఞానం, సస్యరక్షణ తదితరాలపై అవగాహన కల్పించారు. యంత్రాలు, షేర్ నెట్, నిమ్మ నర్సరీ, చీని, మామిడి, సపోటా, జామ తోటల సాగు గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు తిరుపాల్, నాగార్జునరెడ్డి, రాజీవన, ఉపాధ్యాయులు ఉమ, శృతి, దివాకర్, సంతోష్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠపురంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం





ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సాయికృష్ణయాచేంద్ర, మహిళలకు మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్న సాయికృష్ణ యాచేంద్ర

వెంకటగిరి రూరల్ : మండలంలోని నీలకంఠపురం గిరిజనకాలనీలో టీవీఎస్ మోటారు సైకిల్ అనుబంధ శ్రీనివాసన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శనివారం వెంకటగిరి రాజ కుటుంబ సభ్యుడు, ఎస్వీబీసీ చైర్మన్ బీవీ సాయికృష్ణయాచేంద్ర ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని గిరిజనుల సంక్షేమం కోసం శ్రీనివాసన్ సేవా సంస్థ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. శ్రీనివాసన్ సేవా సంస్థ ప్రతినిధి పళనిస్వామి మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా నీలకంఠపురం గ్రామంలో రూ.6.26 లక్షలతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటుచేశామన్నారు. అనంతరం మహిళలకు మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. గిరిజన సంక్షేమశాఖ అధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలుచేస్తోందన్నారు. కార్యక్రమంలో సైట్ ఇంజినీర్ జేసింగ్, జీకే పల్లి పీహెచ్‌సీ వైద్యుడు భాస్కరరావు, ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు దశరథరామిరెడ్డి, గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు అలేఖ్య, కేశవులు, పార్థు పాల్గొన్నారు.

చురుగ్గా కులగణన

సూళ్లూరుపేట రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన పకడ్బందీగా చేస్తున్నట్టు ఎంపీడీవో మురళీ తెలిపారు. మండలంలోని ఎనిమిది సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నట్టు చెప్పారు. ఆర్థిక, ఉద్యోగ, సామాజిక వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తునట్లు పేర్కొన్నారు. ఈ సర్వే ఈ నెల 29 వరకు జరుగుతుందన్నారు.

చిల్లకూరులో..



చిల్లకూరు : వల్లిపేడులో కుల గణన చేస్తున్న సచివాలయ సిబ్బంది

చిల్లకూరు :మండలంలోని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కుల గణనను ముమ్మరంగా చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెల 29వ తేదీ లోగా కుల గణనను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.